# శిరోధార్యమంటూనే 'సుప్రీం' ఆదేశాలు బేఖాతర్

**వివాదాస్పదంగా** తాము భావించే పాలనాపరమైన నిర్ణయాలు ఉన్నత న్యాయస్థానాల విచారణలో ఉండగా పాలకవర్గ పార్టీల ప్రతినిధులంతా న్యాయస్థాన తీర్పు తమకు శిరోధార్యమని పదే పదే ప్రకటిస్తూండటాన్ని మనం గమనించగలం. అందులోనూ ఇక సుప్రీంకోర్టు తీర్పు, ఆదేశాలయితే వేరుగా చెప్పాల్సిన అవసరంలేదు.

అయితే ఇటీవలి కాలంలో కావేరీ జలాల వివాదమై సుప్రీంకోర్టు ఓ తీర్పు వెలువరిస్తూ అక్టోబర్ 1 నుండి 6వ తేదీ వరకు ఆరువేల క్యూసెక్కుల ప్రవాహవేగంతో కావేరీ నదీ జలాలను కర్ణాటక నుండి తమిళనాడుకు విడుదల చేయాలని కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. పాలక మరియు ప్రతిపక్ష పార్టీలైన కాంగ్రెస్, బిజెపిలతో సహా కర్నాటకలోని పాలకవర్గ పార్టీలన్నీ సుప్రీంకోర్టు తీర్పును లక్ష్యపెట్టకుండా, తమిళనాడుకు కావేరీ జలాలు విడుదల కాకుండా అడ్డుకున్నాయి. ఏకంగా అసెంబ్లీ వేదికగా సుప్రీం తీర్పును తిరస్కరిస్తూ తీర్మానం చేశాయి.

కాగా, తమిళనాడు రాష్ట్రంలోని కాంగ్రెస్, బిజెపితోసహా పాలక, ప్రతిపక్ష ఏఐడిఎంకె, డిఎంకె వంటి పార్టీలన్నీ సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించటమేగాక, దానిని వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశాయి.

ఇక, కేంద్రంలోని బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయించటానికి పూనుకోకపోగా, కావేరి నదీజలాల బోర్డునేర్పరచి వివాదాలను పరిష్కరించుకోవాలన్న 'సుప్రీం' నిర్ణయాన్ని తప్పుపడుతూ, న్యాయవ్యవస్థ తన పరిధికి మించి కేంద్ర పాలనా వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటుందని ధ్వజమెత్తింది.

ఏమైనా, వీటన్నిటినడుమ నీరు నిప్పై మండి ఇరు రాష్ట్రాలలోనూ తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. విచక్షణారహితంగా ఇరు రాష్ట్రాలలో పరస్పరం ఆస్తుల విధ్వంసం జరిగింది. ప్రాంతీయ విద్వేషాలను ఎగద్రోసి, ప్రజలను చీల్చి వుంచేందుకే పాలకులు ఉద్దేశ్యపూర్వకంగా వ్యవహరించారు. ఈ పరిణామాలన్నీ ఏమి తెలియచేస్తున్నాయి?

పాలకులు, పాలకవర్గాలు, పాలకవర్గపార్టీలు – తమ వర్గ స్వార్థ ప్రయోజనాలకు లోబడే వ్యవహరిస్తాయని, న్యాయవ్యవస్థ, రాజ్యాంగంపట్ల వారు ప్రకటించే విశ్వాసం లేదా నిబద్ధతా వంటివన్నీ వంచనాపూరితమైనవేనని స్పష్టమౌతోంది.

రామజన్మస్థానమంటూ కాంగ్రెస్ ద్వారాలు తెరువగా, నాలుగు శతాబ్దాలనాటి బాబ్రీ మసీదు స్థానంలో రామమందిరం నిర్మించాలంటూ 1991లో దానిని కూల్చివేసి దేశవ్యాపితంగా బిజెపి రెండు మతాల మధ్య ఆరని చిచ్చును రగిల్చింది. పాలకపక్షాలలోని ఏ పార్టీ కేంద్రంలో ప్రభుత్వాధికారంలోవున్నా, పాలనాపరంగా ఆ సమస్యను పరిష్కరించకుండా న్యాయస్థానాల పరిధిలోకి నెట్టివేశారు. దాదాపు ఇరవయ్యేళ్ళు కోర్టులలో 'విచారణ' అనంతరం లక్నో హైకోర్టు 2010లో తన తీర్పును వెలువరిస్తూ వివాదాస్పద 1500 గజాల భూమిలో హిందూ మతతత్వవాదులకు కూడా సమాన వాటా ఇవ్వాలని పేర్కొంది. ప్రజల మత విశ్వాసాలపై తీర్పు ఇచ్చే అధికారం న్యాయస్థానాలకులేదని అప్పటిదాకా వీరంగం వేసిన సంఘ్‌పరివార్ శక్తులు కోర్టు తీర్పుకు కట్టుబడి వుంటామని ప్రకటించాయి.

మరోవైపున ఇటీవలే భారత క్రికెట్ నియంత్రణామండలి వివాదంలో సుప్రీంకోర్టు తీర్పును పాలకపార్టీలన్నీ బేఖాతర్ చేశాయి. అశ్లీల సినిమాల నియంత్రణ అంశంలోనూ ఉన్నత న్యాయస్థానాల తీర్పులేవీ పాలకపార్టీల చెవికెక్కలేదు. భూమి సమస్యపై ముఖ్యంగా ఆదివాసుల భూమిసమస్యపై కోర్టులు ఇచ్చిన పలు తీర్పుల అమలుకు పాలకపార్టీలేవీ సిద్ధంగాలేవు. ఇలాంటి ఉదాహరణలు ఇంకెన్నో.

ఇక, పాలనాపరంగా అధికారంలోవున్న ప్రభుత్వాలు చేపట్టవలసిన కనీసపాటి కర్తవ్యాలపై సుప్రీం ఆదేశాలు, ఓదార్పు సందేశాలు మినహా ఆచరణ శూన్యంగా మిగిలాయి. రాజ్యాంగంపైన ప్రమాణంచేసి అధికార బాధ్యతలు చేపడుతున్న ప్రభుత్వాలు, న్యాయస్థానాల ఆదేశాలకు బద్ధులై వుంటామని చెప్పేదంతా అత్యధిక ఓటర్లుగా వున్న సామాన్య ప్రజానీకాన్ని వంచించటానికి మాత్రమే ననేది నిస్సందేహం. అర్థవలస–అర్థఫ్యూడల్ సమాజంగా వున్న నేటి మనదేశంలో భూస్వామ్య, సామ్రాజ్యవాద ప్రయోజనాలకనుగుణంగా పాలకులు తమదోపిడీ విధానాలను నిరాటంకంగా కొనసాగించు కోవటానికే రాజ్యాంగం, కోర్టులు, చట్టాలవంటి వ్యవస్థలను సాధనంగా చేసుకుంటారు మినహా, ఆ రాజ్యాంగం, కోర్టులు, చట్టాలు ప్రజల ప్రయోజనాలను నెరవేర్చుతాయని ఆశించటం ఎండమావిలో నీటికోసం వెతుకులాటే! న్యాయస్థానాల తీర్పులు తమ దోపిడీ ప్రయోజనాలకు లోబడి వుంటేనే, పాలకులు ఆ తీర్పును స్వాగతిస్తూ ఆ తీర్పును అమలుజరపాల్సిందేనంటారు. అదే, తమ ప్రయోజనాలకు ఈషణ్మాత్రం భంగం కలిగిస్తుందనుకుంటే 'తూ నా బొడ్డుంబాల్' అని అత్యున్నత న్యాయస్థాన తీర్పునైనా తుడిచి అవతలపడేస్తారు. సామాన్యుడెవరైనా న్యాయస్థాన ఆదేశాన్ని ధిక్కరించాడంటే వాని ఉసురు తీయకుండా ఊరుకుంటారా?! తామింతగా బరితెగించి న్యాయస్థానాల తీర్పులను ఓ వైపు ధిక్కరిస్తూ కూడా న్యాయం, చట్టం ముందు అందరూ సమానులేనని, అందరూ వానికి లోబడాలనే భ్రమను ప్రజల మనస్సుల్లో పాదుకొల్పేందుకు నిరంతరం ప్రయత్నిస్తుంటారు. పాలకుల దోపిడీ విధానాల ఫలితంగా ప్రజాజీవితాలు కల్లోలితమౌతూ, అనివార్యంగా ప్రజలు తిరుగుబాటు చేసే

పరిస్థితి రాకుండా సందర్భోచితంగా ఒక్కో అంగం ఒక్కోసారి 'సేఫ్టీవాల్వు'గా ఉపయోగపడుతూ సరైన దిశలోని ప్రజల ఆందోళనలను నీరుగార్చి, వారిని భ్రమలలో ముంచెత్తే ప్రయత్నం చేస్తూ వస్తోంది.

దశాబ్దాలుగా వెంటాడుతూ అరక్షణంలో ఉద్రిక్తతలను రగులుస్తూ, ఘోర విధ్వంసాలకు కారణ మవుతున్న కావేరీ జలాల వివాదాన్ని పరిష్కరించబూనుకుంటే అది పాలకులకు అసాధ్యమైనదేంకాదు. పంజాబ్ – హర్యానా, తెలంగాణా – ఆంధ్ర, తమిళనాడు – కేరళల మధ్య అంతర్రాష్ట్ర జలవివాదాలను కానీ, ఇలాంటి ఏ సమస్యనైనాకానీ పరిష్కరించకుండా కోర్టులు, చట్టాలు, బోర్డుల ఏర్పాటు, చర్చలు అంటూ కాలయాపన సాగిస్తారు మినహా, సమస్య పరిష్కారం జోలికిమాత్రం వెళ్ళరు.

కార్మికవర్గం, కష్టజీవులు తమ కళ్ళెదుట జరుగుతున్న ఈ నాటకంనుండి సత్యాన్ని గ్రహించాలి. ఈ రాజ్యాంగం, న్యాయవ్యవస్థ, శాసన నిర్మాణవ్యవస్థ, పోలీసులతోసహా ఉన్నతాధికార పాలనా యంత్రాంగమంతా సారాంశంలో ఈ దోపిడీవ్యవస్థ పరిరక్షణే ఏకైక లక్ష్యంగా సాగుతున్నాయనే ఎరుకతో, చైతన్యంతో ఈ దోపిడీ వ్యవస్థ స్థానంలో యావన్మంది దేశ ప్రజానీకంయొక్క ప్రయోజనాల కనుగుణమైన ప్రజాతంత్ర వ్యవస్థ స్థాపనకోసం పూనిక వహించాలి.

ooooo